జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
ఆదివారం | 29 | మార్చి | 2026 ◆ పేజీలు : 5



## రాజీ మార్గమే రాజ మార్గం.. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు

- జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, న్యాయ సేవాధి కార సంస్థ చైర్మన్ రాజగోపాల్
- ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం..
- జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి




**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడ దగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మిగతా 2 లో...


4 లో..

- ఉమ్మడి జిల్లాల వారిగా తమ నియోజకవర్గాల్లో కొత్త బస్సులు, కొత్త రూట్లు , బస్ స్టేషన్ ల అభివృద్ధి , బస్ ల హాల్టింగ్,బస్ డిపో ల అవసరాలు టాయిలెట్స్ నిర్మాణాల తదితర వాటిపై ముఖాముఖి సమావేశంలో వినతి పత్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి సమావేశాలపై మంత్రులు, ఎమ్మెల్యేల ప్రశంసలు
- ప్రజా ప్రతినిధులతో ఆర్టీసీ పై అధికారులు సమన్వయం చేసుకుంటూ సంస్థకు మంచిపేరు తేవాలి
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు మంత్రి పొన్నం ప్రభాకర్

# ఉమ్మడి జిల్లాల వారిగా ఆర్టీసీ సమస్యల పై మూడవ రోజు ఆదిలాబాద్, కరీంనగర్ , ఖమ్మం జిల్లాల ప్రజా ప్రతినిధుల ముఖాముఖి సమావేశం

## ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మున్సిపల్ బడ్జెట్

- బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్



2 లో...

## వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు



- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం
- విద్యుత్, త్రాగునీటి సదుపాయాల పనులు పూర్తి
- లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి
- వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్

మిగతా 2 లో...

## మీ భద్రతే... మా లక్ష్యం సీఐ శ్రీహరి

- సురక్షితమైన ప్రయాణం మీ చేతుల్లోనే సత్తుపల్లి పోలీస్




**సత్తుపల్లి మార్చి28(ప్రజా జ్యోతి)**సురక్షితమైన ప్రయాణం మీ చేతుల్లోనే ఉంటుందని, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేకింగ్ చేయడం ప్రమాదకరమని, ఇది రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీ హరి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మూడోవ విడత అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో సింగరేణి కోల్ మైన్ ప్రాంతంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సీట్ బెల్ట్ లేకుండా కార్లు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, ఇవి ప్రాణాపాయానికి దారితీస్తాయని హెచ్చరించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, ప్రతి వాహనదారు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ఉల్లంఘనలకు పాల్పడే వారిపై మోటార్ వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేసేటప్పుడు ఏకాగ్రతతో చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి మీ జీవితాలతో పాటు మీ కుటుంబాలను రోడ్డుపాలు చేయవద్దని తెలియజేశారు. ఒక కుటుంబ యజమాని ప్రమాదంలో మరణిస్తే, ఆ కుటుంబం మొత్తం జీవితాంతం కష్టాల్లో ఉంటుందని, కుటుంబ బాధ్యత గురించి సీఐ వివరించారు.

## ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా మున్సిపల్ బడ్జెట్

- బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్



**సత్తుపల్లి మార్చి28 (ప్రజా జ్యోతి)** సత్తుపల్లి పురపాలక సంఘం శనివారం రోజు 2026-27 ఆర్థిక సంవత్సరానికి సాధారణ ఆదాయ వ్యవహారాల బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ అధ్యక్షతనజరిగింది. సమావేశం ఉదయం ప్రారంభమైంది.బడ్జెట్ వివరాలు 01-04-2026 నాటి అంచనా ప్రారంభ నిల్వ -20.00 లక్షలు. 2026-27 సంవత్సరం లో సాధారణ ఆదాయం-1195.20 లక్షలు. 2026-27 సంవత్సరం లో సాధారణ వ్యయం -1193.00 లక్షలు. మొత్తంసాధారణ ఆదాయం- 1215.20 లక్షలు.2026-27సంవత్సరం లో క్యాపిటల్ ఆదాయం -5330.00లక్షలు. 2026-27సంవత్సరం లో క్యాపిటల్ వ్యయం -5330.00లక్షలు. మిగులు -22.20లక్షలు. బడ్జెట్ సమావేశం తర్వాత 33 ఎజెండా అంశాలతో కూడిన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల,పట్టణ ప్రజల,సంక్షేమంపై బడ్జెట్ ను తయారు చేశామని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కె. నరసింహ, సీనియర్ ఎకౌంట్ ఆఫీసర్ యనమల సుజాత, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి...)
అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మౌలిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత పది సంవత్సరాల కాలంలో పేదలు మౌలిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహ నిర్మాణం పూర్తి చేయించడమే లక్ష్యమని అన్నారు.వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు,డ్రెయిన్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. నెలలోపు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయాలని, వర్షాకాలం కాలనీలో నీటి నిలువ సమస్యలు ఉండకూడదని మంత్రి ఆదేశించారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి. జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం.. రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు

(మొదటి పేజీ తరువాయి...)
జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీం కోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు.గత లోక్ అదాలత్ లో 8490కేసుల పరిష్కారం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా 6వ స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో 63 మోటారు వాహన ప్రమాదాల కేసులు పరిష్కరించి, 4 కోట్ల 28 లక్షల 98 వేల రూపాయలు పరిహారం క్రింద అందించామని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో జిల్లా ఇంకా మెరుగైన స్థానం సాధించాలన్నారు. ఇందుకు భాగస్వాములందరూ లక్ష్యసాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు.కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భేషజాలకు పోకుండా, ఇరువర్గాల గెలుపు లోక్ అదాలత్ లో ఉంటుందని అన్నారు. పగ, ద్వేషం, కక్ష, ప్రతీకారం ఉంచుకోవద్దని, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, శత్రువునైనా ప్రేమించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో మోటార్ వాహన కేసుకు సంబంధించి ఇన్సూరెన్స్ కంపెనీ నుండి ప్రమాద మరణానికి సెటిల్ మెంట్ కు సంబంధించి, ఫ్యామిలీ కేసుకు సంబంధించి పరిష్కారం చేసి, అవార్డు తోపాటు పూల మొక్కలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుకరించారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జ్,న్యాయ సేవా సదన్ ఇంచార్జ్ కార్యదర్శి కల్పన, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరావు,న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు,మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మార్కెట్ కమిటిల ద్వారా రూ.45.07 కోట్ల ఆదాయం

- మత్కేపల్లి మార్కెట్ అభివృద్ధి కి రూ.8 కోట్ల మంజూరు కు ప్రతిపాధనలు
- జిల్లా మార్కెటింగ్ అధికారి యం.ఏ.ఆలీం



**నేలకొండపల్లి, మార్చి 28ప్రజా జ్యోతి:** జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటిల ద్వారా ఈ ఏడాది రూ.45.07 కోట్ల ఆదాయం సమకూరినట్లు జిల్లా మార్కెటింగ్'అధికారి యం.ఏ.ఆలీం పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయం ను శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... జిల్లాలోని 21 చెకోపోస్టుల ద్వారా మార్కెట్ కమిటి కార్యాలయాల ద్వారా ఈ ఏడాది టార్గెట్ కు చేరువలో ఉన్నట్లు తెలిపారు. ఈ సీజన్ లో రూ.69.50 కోట్ల ను వసూలు లక్ష్యం ఉండగా...ఇప్పటికే రూ.45.07 కోట్ల ను వసూలు చేసినట్లు తెలిపారు. "అంతే కాకుండా ధాన్యం కోనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై శాఖ నుంచి రూ.3.92 కోట్లు, ప్రవేట్ గా రూ.8 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. జిల్లాలో మత్కేపల్లి నూతన మార్కెట్ అభివృద్ధి కి ఖమ్మం మార్కెట్ నుంచి రూ.7 కోట్లు, నేలకొండపల్లి మార్కెట్ నుంచి రూ.1 కోటి ని అందించాలని ప్రతిపాధనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అదే విధంగా సిబ్బంది ని కూడ ఖమ్మం మార్కెట్ నుంచి ముగ్గురు, నేలకొండపల్లి మార్కెట్ నుంచి నలుగురు ను సర్దుబాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చోరవ తో ఖమ్మం లో రూ.155 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న అత్యాధునిక మిర్చి మార్కెట్ ను జూన్ నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ మార్కెట్ వలన దాదాపు 2 లక్షల బస్తాలు నిల్వలు చేసుకునే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. జిల్లాలో సీసీఐ 8 కేంద్రాల ద్వారా 20 వేల మంది రైతుల నుంచి 45 వేల మెట్రిక్ టన్నుల పత్తి ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కపాస్ కిసాన్ విధానం రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

# ప్రమాణ స్వీకారం చేసిన నాగులవంచ దేవస్థాన నూతన కమిటీ

**చింతకాని మర్చి 28ప్రజాజ్యోతి ప్రతినిధి**

నాగులవంచ శ్రీ గజగిరి లక్ష్మీనరసింహస్వామి మరియు శ్రీ కోదండ రామాలయ దేవస్థానం నూతన కమిటీ చైర్మన్ గా ముత్తినేని వెంకటేశ్వర్లు లతో పాటు పాలకవర్గ సభ్యులు గా సిరిసాని రమణ ప్రసాద్ వేముల కృష్ణ , ఏటుకూరి శిరీష ,వెగ్గలం పాండు రంగాచారి(సీతంపేట),పడిశాల మైసయ్య , వెచ్చ మంగయ్య , పణిహారం వెంకట రమణ చార్యులు లచే ఆలయ సన్నిధిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్స్పెక్టర్ సమత శనివారం ప్రమాణ స్వీకారం చేయించా రు. అర్చకులు నూతన పాలకమండలిని వేదోక్త మంత్ర పఠనాలతో తమ ఆశీర్వచనాలు అందజేశారు. ఈ ప్రమాణ



స్వీకారోత్సవం సందర్భంగా స్టేజి పరిమితికి మించి ఎకడంతో స్టేజి స్టేజి ఒక్కసారిగా కూలిపోయింది. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడం అదృష్టం. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ వో రామకోటేశ్వరా వు, పూజారి యోగాం ద్రా చార్యులు, మాజీ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి, ఉప సర్పంచ్ అంబటి శర త్, మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం, ఆలస్యం నాగమణి, నాగులవంచ సొసైటీ మాజీ చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, పాతర్లపాడు మాజీ సర్పంచ్ కాంద్ర పిచ్చయ్య , వివిధ పార్టీల నాయకులు సిలివేరు సైదులు , కొల్లేటి చిన్న బ్రహ్మయ్య ఆళ్ల పెద్ద మాధవరావు , కాటంనేని పుల్లయ్య , ఏటుకూరి రవి , మునుకుంట్ల సుబ్బారావు, రౌతు అ ప్పారావు, బొర్రా ప్రసాద్, ఇమ్మడి కాశ య్య, మాగం కొండలు, పరిటాల లక్ష్మణ స్వామి, తన్నీరు నర్సింహారావు (చిన్నాబాయి ), మునుకుంట్ల లాల్ భూదూర్, చావ అరుణ్ కుమార్ (ఈనాడు), అంబటి శాంతయ్య, కొ మ్మినేని వెంకటేశ్వర రావు, ఆలస్యం బసవయ్య, మండేపూడి మదన్, నె ల్లూరి రమేష్ (సెంటర్), భైరబోయి న హన్మంతరావు,అంబాల వెంకన్న, బైరు వెంకటేశ్వర్లు, కందిమల్ల సైదులు, అనగాని శ్రీనివాసరావు, తాటికొండ రామక్రిష్ణ , యోనిశెట్టి రాజేశ్వరరావు, తేలుకుంట్ల శ్రీనివాసరావు, బోడేపూడి కిరణ్ వంకాయలపాటి కళ్యాణ్ చౌదరి పాల్గొన్నారు.

# ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**ఆన్లైన్ లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లో డబ్బులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి, సుమారు 2 కోట్ల రూపాయలు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందుతులను ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్ర ప్రదేశ్ లోని వెస్ట్ గోదావరి జిల్లా, తణుకు పట్టణంలో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపార వేత్త కి వాట్సాప్ లో పరిచయమైన వ్యక్తులు ఆన్లైన్ లో Fx Pro కంపెనీలో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి వాట్సప్ ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 2 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 7 లక్షలు రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్స్ అయిన ఎండి. సాదిక్ (35), శ్యామ్ బాబు 21 సంలను , తణుకు లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించి న సైబర్ క్రైమ్ డిఎస్పీ, సిహెచ్ ఆర్ వి . ఫణిందర్, ఇన్స్పెక్టర్ కొండపర్తి నరేశ్ ఎస్సై రంజిత్ కుమార్ , కానిస్టేబుల్స్ వెంకట కృష్ణరావు ,కిషన్ రావు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

- కూసుమంచి ఎస్.ఐ నాగరాజు అన్నారు.



**పాలేరు ఆర్. సి మార్చి 28 ప్రజా జ్యోతి**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కుసుమంచి పోలీస్ స్టేషన్ పరిధిలోని నరసింహులగూడెం గ్రామంలో 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమం కూసుమంచి ఎస్ఐ నాగరాజు 3వ విడత కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు హెల్మెట్ల వాడకం, ట్రాఫిక్ నియమాల గురించి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వాహనదారులకు రోడ్డు నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కారణంగా జరిగే ప్రమాదాలు, కుటుంబాలపై పడే ప్రభావం, చట్టపరమైన చర్యలు, ప్రాణనష్టం వంటి అంశాలను నొక్కి చెప్పారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల క్షణిక నిర్లక్ష్యం జీవితాంతం బాధకు దారితీస్తుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ వాడకం, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్ నివారించాలన్నారు. ఎల్లప్పుడూ ఎడమ వైపున ఉంటూ, జీబ్రా క్రాసింగ్ ఉపయోగించాలని తెలిపారు.

# కళాశాల ఆట స్థలాన్ని మినీ స్టేడియంగా మార్చాలి

- సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ
- అడిషనల్ కలెక్టర్‌కు వినతి



**కారేపల్లి, మార్చి 28, ప్రజాజ్యోతి:**సింగరేణి మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఆట స్థలాన్ని మండల క్రీడాకారుల కోసం మినీ స్టేడియంగా అభివృద్ధి చేయాలని సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) అడిషనల్ కలెక్టర్‌కు వినతి చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ శనివారం సింగరేణి మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ కళాశాల క్రీడా ప్రాంగణాన్ని స్టేడియం గా ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. దీనిపై అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, పి ఆర్ ఏఈ రాజశేఖర్, స్థానిక సెక్రటరీ నెహ్రూ, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# తోటకూరి సామ్రాజ్యం దశదినకర్మకు పలువురు నివాళులు



**చింతకాని మర్చి 28ప్రజాజ్యోతి** నాగులవంచ కు చెందిన అంబటి రామకృష్ణ,ఆలస్యం శంకర్ ల అమ్మమ్మ తోటకూరి సామ్రాజ్యం దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసిశనివారంనివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వంకాయలపాటి సత్యనారాయణ, అంబటి రాంబాబు,అంబటిశాంతయ్య, తెలుకుంట్లశ్రీనివాసరావు,తోటకూరి వెంకటనరసయ్య,ఆలస్యం వెంకటేశ్వర్లు,చావా అరుణ్ కుమార్,బోడేపూడి కిరణ్, నన్నక అప్పారావు,నెల్లూరు కోటేశ్వరరావు, యల్లంపల్లి పెద్ద అప్పారావు, జొన్నలగడ్డ సుధాకర్ లు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ని కలిసిన బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ కి 2026–2027 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన ఈ.సి మెంబెర్స్ అందరూ శనివారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ని జిల్లా బార్ ఆసోసియేషన్ నూతన అధ్యక్షులు యాడ్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా క లవడం జరిగింది.పాల్గొన్న సభ్యులు యడ్లపల్లి.రమేష్ నూత న అధ్యక్షుడు ఎస్.కె .జానీ మియా వైస్ ప్రెసిడెంట్ కొప్పుల.రవికుమార్ జనరల్ సెక్రటరీ డి .శిరీష జాయింట్ సెక్రెటరీ డి .రాందాస్ స్పోర్ట్స్ సెక్రటరీ డి .కళ్యాణి, లైబ్రరీ సెక్రటరీకే వీడీ .రాజేశ్వరి ట్రెజరర్,కె.రాధమ్మ లేడీ రిప్రజెంటేటివ్ పాల్గొన్నారు.

# శ్రీనివాస చిన్న పిల్లల ఆసుపత్రిలో అగ్నిమాపక శాఖ అవగాహన కార్యక్రమం

- ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగంపై హాస్పిటల్ సిబ్బందికి శిక్షణ
- అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా ఉండాలి . ఫైర్ అధికారులు



**పాలేరు ఆర్. సి మార్చి 28 ప్రజా జ్యోతి** కూసుమంచి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీనివాస చిన్న పిల్లల ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ మరియు ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అగ్నిమాపక శాఖ అధికారులు ఆసుపత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సమగ్రంగా వివరించారు.అగ్ని ప్రమాదాలు ఎప్పుడు, ఎక్కడైనా సంభవించే అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూ చించారు.ముఖ్యంగా ఆసుపత్రులు వంటి ప్రదేశాలలో రోగులు, చిన్నపిల్లలు ఉండటంతో అగ్ని భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

ఈ సందర్భంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్ ను ఎలా ఉపయోగించాలి, ఏ రకమైన అగ్ని ప్రమాదాలకు ఏ విధమైన ఎక్స్టింగ్విషర్ ఉపయోగించాలో అధికారులు వివరించారు. అనంతరం ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగాన్ని చూపిస్తూ ఆసుపత్రి సిబ్బందికి ప్రాయోగికంగా శిక్షణ అందించారు.అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో భయపడకుండా ధైర్యంగా స్పందించి, వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు.

ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ఆసుపత్రి సిబ్బంది అగ్ని భద్రతపై మరింత అవగాహన పొందారు.కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- ఉమ్మడి జిల్లాల వారిగా తమ నియోజకవర్గాల్లో కొత్త బస్సులు, కొత్త రూట్లు , బస్ స్టేషన్ ల అభివృద్ధి , బస్ ల హాల్టింగ్,బస్ డిపో ల అవసరాలు టాయిలెట్స్ నిర్మాణాల తదితర వాటిపై ముఖాముఖి సమావేశంలో వినతి పత్రాలు సమర్పించిన ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖాముఖి సమావేశాలపై మంత్రులు, ఎమ్మెల్యేల ప్రశంసలు
- ప్రజా ప్రతినిధులతో ఆర్టీసీ పై అధికారులు సమన్వయం చేసుకుంటూ సంస్థకు మంచిపేరు తేవాలి
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు మంత్రి పొన్నం ప్రభాకర్



# ఉమ్మడి జిల్లాల వారిగా ఆర్టీసీ సమస్యల పై మూడవ రోజు ఆదిలాబాద్, కరీంనగర్ , ఖమ్మం జిల్లాల ప్రజా ప్రతినిధుల ముఖాముఖి సమావేశం

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** మహాలక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో నియోజకవర్గాల వారిగా కావాల్సిన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్ ల అభివృద్ధి , కొత్త రూట్లు,బస్ డిపో ల అవసరాల పై మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల ప్రజా ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో కలిసి ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు అదిలాబాద్ , కరీంనగర్ , ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధులతో అసెంబ్లీ కమిటీ హాల్ –1 లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు..చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి తో పాటు కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకట్ స్వామి సూచించారు. సింగరేణి ఏరియా లో కార్మికులకు ఇబ్బందులు లేకుండా గతంలో నడిచిన రూట్లతో పాటు అదనపు రూట్ లలో నడిపించాలని కోరారు.కోరుట్ల నియోజకవర్గంలో మెట్పల్లి, కోరుట్ల బస్ స్టేషన్ లను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా,, సంజయ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ కి విజ్ఞప్తి చేశారు. మొగిలిపేట ప్రధాన రహదారి పై బస్సులు ఆగేలా చూడాలని కోరారు. మండలాల వారిగా హైదరాబాద్ కి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఆత్మకూరు కి 8 ట్రిప్పులు నడిచేవని ఇప్పుడు 4 మాత్రమే నడుస్తున్నాయని వాటి సంఖ్య పెంచాలని కోరారు.కోరుట్ల పట్టణంలో ముత్యాలమ్మ ఆలయం వద్ద బస్సులు ఆగాలని కోరారు. దక్షిణ కాశీగా పిలువబడే వేములవాడ కి అన్ని జిల్లాల నుండి కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ కి సిరిసిల్ల ,కోరుట్ల ,జగిత్యాల , మెట్పల్లి డిపో లోనుండి బస్సులు పెంచాలని సూచించారు. వేములవాడ ,చందుర్తి బస్ స్టేషన్ లను మోడర్న్ స్టేషన్లు గా అభివృద్ధి చేయాలని కోరారు. కథలాపూర్ మండలం రాజారాం తండా,కథలాపూర్ కొండాపూర్ వరకు ,గంభీర్ పూర్ వరకు వస్తున్న బస్సులను మోత్కూరు ,గోవిందపూర్, వరకు సర్వీసులు పెంచాలని కోరారు. చందుర్తి నుండి మర్రిమడ్ల వరకు బస్సులు నడపాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో వేములవాడ నుండి బాంబే కి ప్రారంభమైన బస్సుల వల్ల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.రుద్రంగి , కొనరావుపేట బస్ స్టేషన్లు అభివృద్ధి



చేయాలని కోరారు. మేడిపల్లి మండల కేంద్రంలో ఉన్న బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ లో ఇప్పటికే 1.5 కోట్ల రూపాయలతో నిర్మించమని దానికి మరిన్ని నిధులు కేటాయిస్తే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. అక్కడే ఉన్న ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. రాచపల్లి –నాగంపేట రూట్ లో బస్సులు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి జిల్లా కి చిరకాల స్వప్నం బస్సు డిపో మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే విజయరమణరావు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా డిపో పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. పెద్దపల్లి నుండి హైదరాబాద్ ,హనుమకొండ కి కొత్త బస్సులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమ నియోజకవర్గంలో కొమురవెల్లి అధికముగా వెళ్తుంటారని ఓదెల నుండి కొమురవెల్లి కి ప్రత్యేక బస్సు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థ లో ఉన్న సుల్తానాబాద్ బస్ స్టేషన్ ను నిర్మించాలని కోరారు. కరీంనగర్ – బస్ డిపో నుండి శ్రీరాంపూర్ కి బస్సులు వేయాలని కోరారు.రామగుండంలో అప్పట్లో సిటీ బస్సులు ఉండేవని ఇప్పుడు తొలగించడం వల్ల సింగరేణి లో ప్రధాన పట్టణం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో కొత్త రూట్లలో బస్సులు నడిపించాలని సూచించారు. గోదావరిఖని ఆర్టీసీ ఖరీదైన స్థలంలో డిపో నుండి వేలన్నీ నిర్మించి ముందు వైపు షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రామగుండం, ఎన్టీపీసీ లలో మినీ బస్ స్టేషన్లు నిర్మించాలని కోరారు. 15 కొత్త బస్సులు కావాలని కోరారు. చొప్పదంటి ఆర్టీసీ కాంపౌండ్ వాల్ కొంత రోడ్డుకు ఇస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. కోడిమ్యాల బస్ స్టేషన్ పనులు ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల స్కూల్ సమయంలో అదనంగా బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు.ఖానాపూర్ నియోజకవర్గంలో జగిత్యాల నుండి కడెం బస్సులు నడిపించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. ఆదిలాబాద్ , కరీంనగర్ , హైదరాబాద్ కి బస్సులు పెంచాలన్నారు.ఉట్నూరు ఆదిలాబాద్ మధ్య బస్సులు నడిపించాలని ఉట్నూరు ఆర్టీసీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. నిజాం కాలంలో నిర్మించిన ఆసిఫాబాద్ పురాతన బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి విజ్ఞప్తి చేశారు. బస్ స్టేషన్ లో ఫ్లాట్ ఫాం సంఖ్య పెంచాలని కోరారు. 5 పల్లె వెలుగు బస్సులు గ్రామాలకు నడపాలని కోరారు.నియోజకవర్గం నుండి వేములవాడ ,కొండగట్టు కి ప్రత్యేక బస్సులు నడపాలని కోరారు. ఆర్టీసీ పెట్రోల్ బంకు ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. బస్ స్టేషన్ లో టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. బోథ్ లో చాలా రూట్ లలో బస్సులు బంద్ అయ్యాయని కొత్త రూట్ లలో బస్సులు నడిపించాలని కోరారు.ఇచ్చోడ బస్ స్టేషన్ 18 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉందని దానిని అభివృద్ధి చేయాలని కోరారు. సిరికొండ ,తలైగూడ , కరంజీ , నిగ్నె , వధురు , కుంతల మీదుగా బస్సులు నడపాలని సూచించారు. 2027 జూన్ లో పుష్కరాలు సమీపిస్తుండటంతో బాసర లో బస్ స్టేషన్ ఆధునీకరించాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ విజ్ఞప్తి చేశారు.ఫ్లాట్ ఫామ్ పెంచాలని ,టాయిలెట్స్ నిర్మించాలని కోరారు. ఉబెర్ బస్ స్టేషన్ లో సీసీ వేయాలని కోరారు. భైంసా నుండి పోచ్రాద్ బస్సులు నడపాలన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్ లో బస్ స్టేషన్ అభివృద్ధి చేయాలని రోడ్లతో సంబంధం లేకుండా మారుమూల ప్రాంతాల్లో బస్సులు నడపాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ విజ్ఞప్తి చేశారు.అశ్వారావుపేట లో కవడిగుండ్ల,గుమ్మడవల్లి కి దశాబ్ద కాలం తర్వాత బస్సులు రావడంపట్ల ఎమ్మెల్యే ఆది నారాయణ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దమ్మపేట బస్ స్టేషన్ శిథిలావస్థలో ఉండడంతో దానిని 60లక్షలు మంజూరయ్యాయనీ త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు. భద్రాచలం వెళ్లడానికి విజయవాడ కొత్తగూడెం నుండి కాకుండా ఆల్టర్నేటివ్ రూట్ లో బస్సులు నడపాలని సూచించారు. పినపాక నియోజకవర్గంలో గుండారం మండలంలో రాష్ట్రంలోనే అత్యంత మారుమూల ప్రాంతమని అక్కడ మధ్యాహ్నం సమయంలో అదనంగా బస్సులు నడపాలని కోరారు. మణుగూరు సింగరేణి ప్రాంతంలో లక్ష జనాభా ఉందని అక్కడ బస్ డిపో కి అదనంగా బస్సులు కావాలని కోరారు.నియోజకవర్గం లో అదనంగా బస్సులు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇల్లందు నియోజకవర్గంలో అదనంగా బస్సులు నడపాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు.వైరా నియోజకవర్గం నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుల్లో ఉందని అదనంగా బస్సులు వేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కోరారు.మూడు రోజులుగా ఉమ్మడి జిల్లాల వారిగా మంత్రులు ,ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులు స్వీకరించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అన్ని జిల్లాలో నియోజకవర్గాల వారిగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని బస్ స్టేషన్లలో టాయిలెట్స్ , మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. బస్ స్టేషన్ అభివృద్ధిలో ఆర్టీసీ తో ఎమ్మెల్యేలు తమ ఫండ్స్ ద్వారా సహకరించాలని కోరారు. కొత్త వస్తున్న బస్సులు ఎక్కడెక్కడ అవసరాలు ఉన్నాయి అక్కడకి పంపిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూటులో బస్సులు పంపించడానికి యాక్షన్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులతో లు ఆర్టీసీ అధికారులు ప్రజాసంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం వహిస్తే ఆ చర్యలు తప్పవని హెచ్చరించారు.సమీక్షా సమావేశంలో కరీంనగర్ ఆదిలాబాద్ , ఖమ్మం ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, డా,, సంజయ్ కుమార్,కౌశిక్ రెడ్డి ,మేడిపల్లి సత్యం, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, విజయ రమణ రావు ,వెడ్మా బొజ్జు, కోవా లక్ష్మి ,అనిల్ జాదవ్ , రామారావు పటేల్ ,పాల్వాయి హరీష్ బాబు ,పాయం వెంకటేశ్వర్లు ,రాందాస్ నాయక్ ,జారే ఆది నారాయణ,కోరం కనకయ్య ,ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడి లు , ఆర్ఎం లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- భక్తుల జయజయధ్వానాల మధ్య రాజలాంఛనాల సమర్పణ
- రామచంద్రుడికి అష్టోత్తర శత నామార్చన
- పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్ శివప్రతాప్ శుక్ల
- హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్



# కల్యాణ రాముడికి... మహా పట్టాభిషేకం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 28, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి వసంతపక్ష బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ రాముడికి శనివారం శ్రీరామ మహా పట్టాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం సాగిన ఈ మహోత్సవంలో భక్తుల జయజయధ్వానాల మధ్య కల్యాణ సార్వభౌముడికి రాజలాంఛనాలు సమర్పించారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించగా, పుష్యమి నక్షత్ర పర్వదినాన కల్యాణ రాముడికి పట్టాభిషేక ఘట్టాన్ని మిథిలా స్టేడియంలో భక్తజన కోలాహలం నడుమ నిర్వహించారు. నూతన దంపతులైన సీతారామచంద్రస్వామివారిని శనివారం ఉదయం 9.40 గంటలకు ఆలయం నుంచి మేళతాళాలు, భజన్త్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాటాల మధ్య మిథిలా స్టేడియంకు తీసుకువచ్చారు. ఉదయం 10.30 గంటలకు అక్కడికి చేరుకుని, 10.48 గంటలకు శిల్పకళాశోభితమైన కళ్యాణ మండపంలో ఆసీనులయ్యారు. అనంతరం అర్చకస్వాములు, వేదపండితులు పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, కలశారాధన అనంతరం రాజలాంఛనాలతో పట్టాభిషేకాన్ని ఘనంగా చేపట్టారు. ఎనిమిది మంది వైదిక మంత్రులు పాల్గొనగా, వశిష్ఠ స్థానంలో భద్రాద్రి దేవస్థానం విశ్రాంత ముఖ్య అర్చకులు అమరవాది వెంకట సీతారామానుజాచార్యులు ఉన్నారు. తదుపరి తారక మంత్రం, అష్టోత్తర శతనామార్చన నిర్వహించారు. శ్రీరామ మహాసామ్రాజ్య ఘట్టంలో భాగంగా ఒక్కొక్కటి స్వామివారికి అలంకరించారు. ముందుగా బంగారు పాదుకలను సమర్పించి, అనంతరం రాజదండం, రాజముద్రిక, భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం శ్రీరాముడికి, చింతాకు పతకం సీతమ్మకు, శ్రీరామమాడను లక్ష్మణస్వామికి సమర్పించారు. తదుపరి చామరం, బంగారు చత్రం, రాజఖడ్గం సమర్పించి చివరగా సామ్రాట్ కిరీటాన్ని ధరింపజేశారు. దేవేంద్రుడు పంపిన కానుకగా చెప్పబడే ముత్యాలహారాన్ని తొలుత శ్రీరాముడికి ధరింపజేసి, అనంతరం అది సీతమ్మకు, తరువాత భక్తుల ప్రతినిధిగా హనుమంతుడికి సమర్పించారు. అనంతరం సమస్త నదీజలాలు, నాలుగు సముద్రాల నుంచి సేకరించిన తీర్థాలతో స్వామివారికి ప్రోక్షణ నిర్వహించారు. ఆ తీర్థజలాలను గవర్నర్ శివప్రతాప్ శుక్ల, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భక్తులపై ప్రోక్షణ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆహోబిల మఠం, చినజీయర్ స్వామి, కంచి పీఠం, భక్తరామదాసు వారసుల తరపున కూడా ప్రతినిధులు పట్టు వస్త్రాలను సమర్పించారు. భద్రాచలం చేరుకున్న గవర్నర్‌కు బీపీఎల్ పాఠశాల హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీఓ బి. రాహుల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ప్రథమ శ్రేణి న్యాయాధికారి శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.







